క్లుప్తంగా

పాఠశాలకు బెంచీల బహూకరణ



బెంచీలు బహూకరిస్తున్న పూర్వవిద్యార్థులు

మద్దిరాల : మండల పరిధిలోని గోరెంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1987–88 సంవత్సరం 10వ తరగతి బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థి చిదిరాల శ్రీనివాస్ తన మిత్రులతో కలిసి గురువారం ఆ పాఠశాలకు రూ.25వేల విలువగల బెంచీలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు షరీఫ్ ఉన్నీషా, ఉపాధ్యాయులు క్రిష్ణవేణి, శ్రీనివాస్‌రెడ్డి, భిక్షం, నాగులు, సీఆర్పీ నవీన్, తాళ్లపెల్లి మల్లేష్, బద్దం ఉప్పల్‌రెడ్డి, బద్దం అమృతరెడ్డి, ఆవుల ఇంద్ర, వర్దెల్లి పద్మ, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలోని లోయపల్లి, సూర్యానాయక్‌తండా, కోమటిపల్లి గ్రామాల్లో శుక్రవారం ఎమ్మెల్యే మందుల సామేల్ పర్యటిస్తారని ఎంపీడీఓ గోపి తెలిపారు. ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేస్తారని, సీసీ రోడ్లను ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

యూరియా సరఫరాలో కేంద్ర ప్రభుత్వం విఫలం

తుంగతుర్తి : రైతులకు కావలసిన యూరియాను సరఫరా చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. యూరియాను సరఫరా చేయకుండా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్న బీజేపీ ప్రభుత్వ విధానాన్ని రైతులు, మేధావులు గమనిస్తున్నారని అన్నారు.

మండల రైతులకే యూరియా సరఫరా

నూతనకల్ : సహకార పరపతి సంఘం పరిధిలోని గ్రామాల రైతులకే యూరియా అందించనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధను ధాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లా అధికారుల సూచన మేరకు నూతనకల్, మద్దిరాల మండలాలకు చెందిన రైతులు తమ పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులతో యూరియా కోసం కార్యాలయానికి రావాలని ఆమె సూచించారు. ఇతర మండలాలకు చెందిన రైతులు అధిక మొత్తంలో రావడం వలన సహకార సంఘం పరిధిలోని రైతులకు యూరియా లభించక ఇబ్బందులకు గురవుతున్నందున, ఈ నిబంధనలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.

రైతులు ఆందోళన చెందవద్దు

తుంగతుర్తి : యూరియా పంపిణీ గురించి రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, రైతులకు సరిపడా యూరియా తెచ్చేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని తుంగతుర్తి సహాయ వ్యవసాయ సంచాలకుడు రమేష్ బాబు అన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తప్పనిసరిగా పట్టాదార్ పాస్ పుస్తకంతో పాటు ఆధార్ కార్డు ఉంటేనే రైతులకు యూరియాకు సంబంధించిన టోకెన్లు ఇస్తామని అన్నారు. దీనివల్ల యూరియా పంపిణీలో అక్రమాలను అరికట్టేందుకు వీలుంటుందని తెలిపారు.

వాటర్ ప్లాంట్ ఎదుట నిరసన



జాజిరెడ్డిగూడెంలో వాటర్‌ప్లాంట్ ఎదుట నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మేజర్ గ్రామ పంచాయతీలో ఏడు నెలలుగా వాటర్ ప్లాంట్ పని చేయక మూతపడిందని, వెంటనే ప్లాంట్‌ను పునరుద్ధరించాలని గ్రామస్తులు గురువారం వాటర్ ప్లాంట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. స్వచ్ఛమైన తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. వెంటనే ప్లాంట్‌ను పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, యువకులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం చేస్తున్న పరమేశ్వర్

నాగారం : మండల కేంద్రానికి చెందిన అనంతుల ఎల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, హైకోర్టు అడ్వకేట్ కడియం పరమేశ్వర్ బుధవారం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.5,000 ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కన్నెబోయిన వెంకటభిక్షం, మంగదుడ్ల దశరథ, అనంతుల వెంకటయ్య, భైరబోయిన సత్తయ్య, కన్నెబోయిన వెంకన్న, గద్దల సైదులు, స్వామి, మంగదుడ్ల సైదులు, సతీష్, రమేష్, జమున, మంగదుడ్ల అంజయ్య, కడియం శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు తెగి.. ప్రయాణం ప్రమాదకరమై..

- వర్షాల కారణంగా వరద ప్రవాహానికి తెగిన సంగెం గ్రామ రహదారి
- నెల రోజులుగా రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు



సంగెం వెంట తిమ్మాపురం వెళ్లే రహదారి తెగి ప్రవహిస్తున్న నీరు

తుంగతుర్తి : గత నెలలో కురిసిన భారీ వర్షాల కారణంగా తుంగతుర్తి మండలంలోని సంగెం గ్రామంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి రెండు వైపులా ఉన్న రహదారులు తెగిపోవడంతో బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి.

రహదారులు పూర్తిగా ధ్వంసం..

గ్రామానికి ఒకవైపు ఉన్న రుద్రమ చెరువు అలుగు పారడంతో, దాని ప్రవాహానికి రహదారి పూర్తిగా కొట్టుకుపోయింది. ఈ వాగుపై రూ. 12 కోట్లతో లో–లెవల్ బ్రిడ్జి నిర్మాణం జరుగుతోంది. అయితే పనులు పూర్తికాకముందే భారీ వర్షాలు కురవడంతో, వరద ఉధృతికి తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రోడ్డు తెగిపోయింది. మరోవైపు, సంగెం నుంచి వెంకేపల్లి వెళ్లే మార్గంలో ఉన్న సంగెం చెరువు అలుగు పారడంతో ఆ రోడ్డు కూడా తెగిపోయింది. దీంతో గ్రామం నుంచి వెంకేపల్లి, తిమ్మాపురం వైపు వెళ్లడానికి అవకాశం లేకుండా పోయింది. ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

ప్రజలు, రైతుల అవస్థలు..

రహదారులు దెబ్బతినడంతో సూర్యాపేట నుంచి తిమ్మాపురం మీదుగా సంగెం నుంచి తుంగతుర్తికి, అలాగే సూర్యాపేట, నూతనకల్, వెంకేపల్లి నుంచి సంగెం మీదుగా తుంగతుర్తికి వెళ్లే బస్సులు రావడం లేదు. దీంతో గ్రామ ప్రజలు ఎటూ వెళ్లలేని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. పొలాలకు వెళ్లాలంటే నడుములోతు నీటిలోంచి నడవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తాత్కాలిక ఏర్పాటు చేయించాలి

గ్రామానికి రెండు వైపులా ఉన్న వాగులు, చెరువుల అలుగుల నిర్మాణం పూర్తి కావడానికి సమయం పడుతుంది. కాబట్టి, రాకపోకలు తాత్కాలికంగా కొనసాగేలా మోరీలను ఏర్పాటు చేసి ప్రయాణ సౌకర్యం కల్పించాలి. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి.



– నాగరాజు, సంగెం

నీటిలోంచి వెళ్లాల్సి వస్తోంది

తమ పొలాలకు వెళ్లాలంటే నడుములోతు నీటిలోంచి వెళ్లాల్సి వస్తోంది. బ్రిడ్జి నిర్మాణం కోసం తీసిన లోతైన గుంతల వల్ల వెళ్లడానికి భయమేస్తోంది. వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి ఉంది కాబట్టి, తాత్కాలిక ఏర్పాట్లు చేయాలి.



– లక్ష్మమ్మ, సంగెం

నిర్మాణ పనులు పూర్తిచేయాలి

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

భానుపురి : నూతనంగా మంజూరైన ప్రభుత్వ భవనాలు, ఇందిరమ్మ ఇళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయిలెట్స్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఆదేశించారు. గురువారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పనులు ప్రారంభం కాని వాటికి సెప్టెంబర్ చివరి నాటికి స్థలాలు సేకరించి పనులు మొదలు పెట్టాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయిలెట్స్ పూర్తిచేయాలని, ఉపాధి హామీ పథకం పనులు, అజోల్లా యూనిట్లు, గోట్ షెడ్లు, వర్మీ కంపోస్ట్ యూనిట్లు తదితర పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. వన మహోత్సవంలో శాఖలవారీగా లక్ష్యాలను సాధించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ పూర్తికానివి ఇంకా ఉంటే వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ వీవీ అప్పారావు, డీపీఓ యాదగిరి, హౌసింగ్ పీడీ సిద్ధార్థ, ఇన్‌చార్జి స్త్రీ, శిశు సంక్షేమ అధికారి దయానంద రాణి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఈఈలు మాధవి, వెంకటయ్య, ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీరాజ్ ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల రాస్తారోకో



అర్వపల్లిలో పీఏసీఎస్ ఎదుట హైవేపై రాస్తారోకో చేస్తున్న రైతులు

అర్వపల్లి : అర్వపల్లికి గురువారం యూరియా రాకపోవడంతో రైతులు పీఏసీఎస్ ఎదుట హైవేపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడారు. యూరియా కొరతను వెంటనే తీర్చాలని కోరారు. యూరియా కోసం రేయింబవళ్లు తిరగాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారిపై వందలాది వాహనాలు నిలిచిపోవడంతో నాగారం సీఐ నాగేశ్వరరావు, తహసీల్దార్ బాషపాక శ్రీకాంత్, ఏఓ గణేష్, ఏఎస్ఐ రామకోటిలు రైతులకు నచ్చజెప్పి రాస్తారోకోను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్, ఆయా గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ విప్లవకారుడు దుబ్బాక సంజీవరెడ్డి



సూర్యాపేటఅర్బన్: నివాళులర్పిస్తున్న నాయకులు



నాగారం : పసునూర్‌లో..

సూర్యాపేట అర్బన్ : ఆదర్శ విప్లవకారుడు దుబ్బాక సంజీవరెడ్డి అని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. దుబ్బాక సంజీవరెడ్డి వర్ధంతి సందర్భంగా గురువారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దుబ్బాక సంజీవరెడ్డి ఆశయాలతో ప్రజా ఉద్యమాలను నిర్మిస్తామని అన్నారు. విప్లవ భావాలతో రేపటి తరానికి ఆదర్శమూర్తిగా నిలిచిన సంజీవరెడ్డి బూటకపు ఎన్‌కౌంటర్‌లో అమరుడయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు కారింగుల వెంకన్న, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర అఖిల్ కుమార్, టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు గొడ్డలి నర్సయ్య, నాయకులు పుప్పాల అంజయ్య, బాలస్వామి, శివ, ఐతరాజు పద్మ, గౌరమ్మ, రహమతి, మీనాక్షి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

నాగారం : సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కమిటీ నాయకుడు, ప్రతిఘటన పోరాట యోధుడు దుబ్బాక సంజీవరెడ్డి త్యాగం మరువలేనిది సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ తుంగతుర్తి డివిజన్ కార్యదర్శి పేర్ల నాగయ్య అన్నారు. గురువారం దుబ్బాక సంజీవరెడ్డి వర్ధంతి సందర్భంగా పసునూర్ గ్రామంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు వేల్పుల లక్ష్మయ్య, మామిడి సుధాకర్, వేల్పుల పరశురాం, ఎరసాని అంజయ్య, కమటం బుచ్చాలు, మామిడి సత్తెమ్మ, మామిడి నాగమ్మ, పొదిల రవి, మల్లెపాక వెంకటమ్మ, మల్లెపాక సుగుణమ్మ, చలిమల కర్రయ్య, కుంభం ఎల్లయ్య పాల్గొన్నారు.

వసతిగృహంలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం

అర్వపల్లి : అర్వపల్లిలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో గురువారం తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వసతిగృహ సంక్షేమాధికారి కాటూరి రామానుజాచార్యులు మాట్లాడారు. పిల్లలు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. హాస్టల్‌లో అమలవుతున్న మెనూను తల్లిదండ్రులకు వివరించారు. క్రమశిక్షణతో చదువుకొని ఉన్నతస్థాయికి వెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాణిక్యం, సరిత, వసతి గృహ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రుద్రమ చెరువును పర్యాటక కేంద్రంగా మారుస్తాం



తుంగతుర్తి : రుద్రమ చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సామేల్



నాగారంలో భవిత కేంద్రం పనులను ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే మందుల సామేల్

తుంగతుర్తి : రుద్రమ చెరువును పర్యాటక కేంద్రంగా మార్చేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. గురువారం వెలుగుపల్లి గ్రామ శివారులోని రుద్రమ చెరువును రాష్ట్ర పర్యాటక శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. 600 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ కాకతీయుల కాలం నాటి చెరువు ప్రాంతాన్ని సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడి అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. జాతీయ రహదారికి పక్కనే ఉన్నందువల్ల, అభివృద్ధి చేస్తే రుద్రమ చెరువును మరో లక్నవరంగా మారుతుందని తెలిపారు. చెరువులో బోటు, గుట్టల వద్ద స్టాల్స్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని అధికారులకు సూచించారు. అనంతరం రాష్ట్ర పర్యాటక సంస్థ ఈడీ ఉపేందర్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి వివరించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ ప్రాజెక్ట్ అధికారి రామకృష్ణ, తహసీల్దార్ దయానందం, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, పార్టీ మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, ఎల్సోజు నరేష్, మార్కెట్ వైస్ చైర్మన్ చింతకుంట్ల, కలకోట్ల మల్లేష్, దాసరి శ్రీను, కొండ రాజు, మాచర్ల అనిల్, గంగరాజు యాదవ్, రామడుగు నవీన్ చారి, వాసం వెంకన్న, సోమ్లా నాయక్, ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం..

నాగారం : గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. గురువారం ఫణిగిరి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.40 లక్షలతో సీసీరోడ్ల పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి గురించి మాట్లాడే నైతిక హక్కు జగదీష్ రెడ్డికి లేదన్నారు. ప్రజల కోసం, ప్రజల చేత ఎన్నుకోబడిన నాయకుడు రేవంత్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు, కడియం పరమేశ్వర్, మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య, పానుగంటి నర్సింహారెడ్డి, కన్నెబోయిన వెంకటభిక్షం పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థుల సంక్షేమానికే..

దివ్యాంగ విద్యార్థుల సంక్షేమం కోసమే రాష్ట్ర ప్రభుత్వం భవిత కేంద్రాలను నిర్మిస్తోందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. గురువారం నాగారంబంగ్లా వద్ద ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణలో రూ.9.50లక్షల వ్యయంతో భవిత కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి వాసం ప్రభాకర్, ఏఈఈ రంగారావు, హెచ్ఎం ఉమమహేశ్వరి, ఉపాధ్యాయులు కమల, మీనా, ఐఈఆర్పీ బాషా, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు, కడియం పరమేశ్వర్, మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేసిన వారికి గుర్తింపు



నాగారంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్



అర్వపల్లి : ఉత్తమ ఉపాధ్యాయురాలు స్వరూప రాణిని సన్మానిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు



తిరుమలగిరి జూనియర్ కళాశాలలో జానయ్యను సన్మానిస్తున్న కళాశాల బృందం

నాగారం : అంకితభావంతో పనిచేసిన వారికి ఎల్లప్పుడూ గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందన్నారు. విద్యార్థులకు మార్గదర్శకులుగా ఉండి, వారిని ఉన్నత స్థాయికి ఎదిగేవిధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన బి.విష్ణుమూర్తి, కె. సోమసుందర్, మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఆర్.జానకి, రాందాస్‌నాయక్, శివకుమార్, ఎస్.రఘు, కె.సైదులు, డి. వెంకన్న, బి.శ్రీహరి, జి.రవిత, బి.భాస్కర్, ఆర్.వెంకన్న, చిలుక రవి, కొయ్యడ సాధన, సీహెచ్ సుజాత, ఎల్.మహేశ్వరిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి వాసం ప్రభాకర్, కాంప్లెక్స్ హెచ్ఎంలు జ్ఞానేశ్వరచారి, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్వపల్లి : అర్వపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు భూపతి స్వరూపరాణి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు పొందడంతో గురువారం పాఠశాలలో స్వరూపరాణి–శ్రీనివాస్‌గౌడ్ దంపతులను ఎంఈఓ బాలునాయక్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాసర్లపహాడ్ పీఎస్ హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు దబ్బేటి యాదగిరి, రేణుక, శైలజ, వినీత, సిబ్బంది కవిత, ఏడుకొండలు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తిరుమలగిరి : తిరుమలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు జానయ్య జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జానయ్యను తిరుమలగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మృత్యుంజయ, బాల్తా శ్రీనివాస్, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సాయుధ పోరాట యోధులకు సన్మానం



సన్మానిస్తున్న సీపీఎం నాయకులు

చివ్వెంల : తెలంగాణ సాయుధ పోరాట ఉత్సవాల సందర్భంగా బి.చందుపట్ల గ్రామానికి చెందిన నాటి పోరాట యోధులను గురువారం సీపీఎం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. గ్రామానికి చెందిన పారెపల్లి వెంకయ్య, కలగాని సోమయ్య, పారెపల్లి లక్ష్మమ్మలను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మట్టపల్లి సైదులు, జిల్లా కమిటీ సభ్యుడు వేల్పుల వెంకన్న, సీపీఎం మండల కార్యదర్శి ఇట్టమళ్ల స్టాలిన్, నాయకులు బొప్పని సులేమాన్, వల్లపుదాసు జానయ్య, నాగిరెడ్డి వెంకట్ రెడ్డి, బూడిద లింగయ్య, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు భారమైన శిశువు మృతదేహం

- ఎంజీఎం మార్చురీలో వదిలేసిన కన్నవారు
- శిశువు తల్లిదండ్రులది సూర్యాపేట జిల్లా

ఎంజీఎం(వరంగల్): ఎంజీఎం మార్చురీలో ఓ పసికందు మృతదేహాన్ని తల్లిదండ్రులు వదిలివెళ్లిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం మామిడాల గ్రామానికి చెందిన హైమవతి–అనిల్ దంపతులు. హైమావతి 7 నెలల గర్భిణి కాగా, ఇటీవల తొర్రూరు ఆస్పత్రిలో శిశువుకు జన్మనిచ్చింది. ఈ క్రమంలో శిశువుకు గుండె సమస్య ఉందని చెప్పడంతో అక్కడి నుంచి వరంగల్‌లోని ఎంజీఎం నవజాత శిశు కేంద్రానికి తీసుకొచ్చి చికిత్స చేస్తుండగా ఈనెల 8న శిశువు మృతి చెందింది. పసికందు మృతదేహాన్ని తల్లిదండ్రులు ఆస్పత్రి మార్చురీలో వదిలివెళ్లారా, డబ్బులు లేకపోవడంతో మున్సిపల్ సిబ్బంది ఖననం చేస్తారు అని వదిలివెళ్లారో తెలియదు. కానీ, గురువారం సాయంత్రం ఆస్పత్రిలో ఈ విషయం చర్చకు దారితీసింది. వెంటనే విషయం తెలుసుకున్న మట్టెవాడ పోలీసులు.. మార్చురీలో ఉన్న పసికందు మృతదేహం గురించి సదరు తల్లిదండ్రులకు సమాచారం అందించారు. శుక్రవారం ఉదయం తల్లిదండ్రులు మరోసారి ఎంజీఎం మార్చురీకి రానున్నట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ తెలిపారు.

గంజాయికి బానిస కావొద్దు

అనంతగిరి : యువత గంజాయికి బానిస కావొద్దని కోదాడ రూరల్ సీఐ ప్రతాప్ లింగం అన్నారు. గురువారం అనంతగిరి పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యువత గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి విక్రయించినా, కొనుగోలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులకు యువకులు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను గమనిస్తూ ఉండాలని కోరారు. గ్రామాలు, పట్టణాల్లో అనుమానిత వ్యక్తులు ఉన్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. రానున్న ఎన్నికలు, బతుకమ్మ సంబరాల్లో అలజడులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట అనంతగిరి ఎస్ఐ నవీన్‌కుమార్, పోలీస్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

భవిత కేంద్రాలకు సొంత భవనాలు



అర్వపల్లిలో భవిత కేంద్ర భవన నిర్మాణానికి ముగ్గు పోస్తున్న అధికారులు



తుంగతుర్తిలో భవిత కేంద్ర భవనానికి జరుగుతున్న మరమ్మతు పనులు

- తుంగతుర్తి నియోజకవర్గంలో నాలుగు మండలాలకు రూ.38లక్షలు
- రెండు పాత భవనాల మరమ్మతుకు రూ.9.75లక్షలు మంజూరు

అర్వపల్లి : ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం ఏర్పాటు చేసిన భవిత కేంద్రాలకు మహర్దశ పట్టింది. ఇంతకాలం ఈ కేంద్రాలను తాత్కాలికంగా ఎంఆర్‌సీ ఆవరణలోని ఇరుకైన, కనీస వసతులు లేని గదులలో నిర్వహించారు. అయితే ఇప్పుడు ప్రభుత్వం అన్ని మండలాల్లో భవిత కేంద్రాల కోసం సొంత భవనాల నిర్మాణం చేపట్టడానికి నిధులు మంజూరు చేసింది. తుంగతుర్తి నియోజకవర్గంలోని జాజిరెడ్డిగూడెం, నాగారం, మద్దిరాల, నూతనకల్ మండలాల్లో భవిత కేంద్రాలకు భవనాల నిర్మాణం కోసం ఎస్ఎస్ఏ నుంచి రూ. 38 లక్షలు మంజూరయ్యాయి. ఒక్కో భవనం నిర్మాణానికి రూ. 9.50 లక్షలు కేటాయించారు. ఈ మండలాల్లో భవనాల నిర్మాణానికి పునాది పనులు ప్రారంభం కావాల్సి ఉంది. అలాగే తుంగతుర్తి, తిరుమలగిరి మండలాల్లో ఇప్పటికే ఉన్న భవిత కేంద్రాల మరమ్మతులకు రూ. 9.75 లక్షలు మంజూరు కాగా, ఆ పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి.

రూ.38 లక్షలు మంజూరు



తుంగతుర్తి నియోజకవర్గంలోని నాగారం, జాజిరెడ్డిగూడెం, మద్దిరాల, నూతనకల్ మండలాల్లో భవిత కేంద్రాల నూతన భవనాల నిర్మాణానికి రూ. 38 లక్షలు మంజూరు అయ్యాయి. అదేవిధంగా తిరుమలగిరి, తుంగతుర్తిలోని భవిత కేంద్రాల మరమ్మతులకు రూ. 9.75 లక్షలు మంజూరు కాగా పనులు కొనసాగుతున్నాయి.

– రంగారావు, టీజీఈడబ్ల్యూఐడీసీ, ఏఈ

వీధులన్నీ జలమయం..

- జాలుతో పాకురుబట్టిన వీధులు
- ప్రమాదాల బారిన పడుతున్న గ్రామస్తులు



పాకురుతో ప్రమాదకరంగా ఉన్న వీధి

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని ఏపూరులో ఏ వీధిలోకి వెళ్లినా దారులన్నీ పాకురు బట్టి ప్రమాదకరంగా ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో చెరువులు పూర్తిగా నిండడంతో పాటు కుంటలు అలుగు పోశాయి. దీంతో గ్రామంలోని పలు వీధుల్లోకి జాలు నీరు ఊటగా వస్తోంది. కొన్ని వీధులలో మురుగు కాలువలు ఉన్నా జాలునీటితో సీసీ రోడ్లు పాకురు పట్టి ప్రమాదకరంగా మారాయి. కొన్ని ఇళ్లల్లో కూడా జాలునీరు పారుతుండడంతో దోమలకు ఆవాసాలుగా ఉంటున్నాయి. సీసీ రోడ్లు జారుతుండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువుకు కింది భాగంలో కొన్ని వీధులు ఉండటంతో ఇలా ఊటనీరు వస్తోందని గ్రామస్తులు అంటున్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడలను విజయవంతం చేయాలి

నూతనకల్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 16న నిర్వహించే తుంగతుర్తి నియోజకవర్గస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలను విజయవంతం చేయాలని ఎస్‌జీఎఫ్ మండల క్రీడా కన్వీనర్, మండల విద్యాధికారి రాములు నాయక్ కోరారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ప్రతి మండలం నుంచి అండర్ –14, అండర్ –17కు చెందిన టీమ్‌లు మార్చ్‌ఫాస్ట్‌లో పాల్గొనాలని కోరారు. క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు తమ వయస్సు ధ్రువీకరణ పత్రాలను తీసుకురావాలని, క్రీడాకారులందరూ స్పోర్ట్స్ డ్రస్‌లోనే ఉండేటట్టు చూడాలని అన్నారు. ప్రథమ, ద్వితీయ బహుమతులతో పాటు టీమ్‌లోని ప్రతి క్రీడాకారుడికి షీల్డు, మెడల్ అందజేయనున్నట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల అడ్డగింపు



జాజిరెడ్డిగూడెంలోకి ఇసుక ట్రాక్టర్లు రాకుండా అడ్డుకుంటున్న గ్రామస్తులు

అర్వపల్లి : తుంగగూడెం ఇసుక రీచ్ నుంచి ఇసుక ట్రాక్టర్లు జాజిరెడ్డిగూడెం మీదుగా వెళ్లొద్దని గురువారం గ్రామస్తులు అడ్డుకొని పేరబోయినగూడెం మీదుగా పంపించారు. గ్రామంలోకి ఇసుక ట్రాక్టర్లు రావడం వలన ప్రమాదాలు జరగడంతో పాటు రాకపోకలకు ఇబ్బందులు అవుతున్నాయని చెప్పారు. రీచ్ నుంచి పేరబోయినగూడెం మీదుగా అర్వపల్లికి వెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు, తదితరులు పాల్గొన్నారు.

పీడీ, పీఈటీల సమావేశం

అర్వపల్లి : అర్వపల్లిలోని జెడ్పీహెచ్ఎస్‌లో గురువారం నియోజకవర్గ స్థాయి వ్యాయామ ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశాన్ని ఎంఈఓ బి. బాలునాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కాంపెక్స్ సమావేశం నైపుణ్యాలను పెంపొందించుకోవడం కోసం దోహదపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఆర్పీ సంజీవరెడ్డి, ఇన్‌చార్జ్ హెచ్ఎం ఉప్పు మధుకర్, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.మల్లేష్, వివిధ మండలాల పీడీలు, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.